క్లుప్తంగా

పౌష్టికాహారం పంపిణీ

దెందులూరు: అంగన్‌వాడీ, భవిత సెంటర్లల్లో చిన్నారుల ఆరోగ్యంపై పర్యవేక్షణ, పౌష్టికాహారం పంపిణీ, కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని దెందులూరు ఎంపీపీ బొమ్మన బోయిన సుమలత అన్నారు. బుధవారం పోతునూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గుడ్లతో పాటు పౌష్టికాహారాన్ని వైఎస్సార్‌సీపీ నేత బత్రాజు సత్యనారాయణతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.

సుపరిపాలన అందించాలి

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం జెడ్పీటీసీ సభ్యులకు జిల్లా పరిషత్ పరిపాలనా అంశాలు, విధులు, బాధ్యలు, పంచాయతీరాజ్ చట్టం, వివిధ ప్రభుత్వ శాఖల కార్యక్రమాలు జిల్లా అధికారుల విధులకు సంబంధించిన అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ శిక్షణ ద్వారా సభ్యులు సాధికారిత సాధించి, సుపరిపాలన అందించాలని తూర్పుగోదావరి జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జీ.ప్రసంగిరాజు కోర్సు డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట విస్తర్ణ శిక్షణా కేంద్రంలో నిర్వహించిన జెడ్పీటీసీ శిక్షణ తరగతుల కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతానికి సర్టిఫికెట్, మెటీరియల్‌ను అందజేశారు.

నీట్‌లో వివేక్‌కు ర్యాంకు


గద్దె వివేక్ (2975)

దెందులూరు: దెందులూరు వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్ కుమారుడు గద్దె వివేక్ నీట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 2,975 ర్యాంకు సాధించాడు. పలువురు మండలాధికారులు, ప్రజాప్రతినిధులు నీట్‌లో సీటు సాధించిన వివేక్‌ను, వివేక్ తండ్రి ఏఓ రమేష్‌ను అభినందించారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు దాతల ప్రోత్సాహం

నిడమర్రు: ప్రతిభావంతులైన విద్యార్థులకు దాతల ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని వైఎస్సార్‌ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు వేగేశ్న జనార్దన గోవిందరాజు అన్నారు. పత్తేపురంలోని చింతలపాటి మూర్తిరాజు జెడ్పీ స్కూల్లో 2023 పదో తరగతి ఫలితాల్లో స్కూల్ టాపర్‌గా నిలిచిన విద్యార్థి సంజనను అభినందిస్తూ ఆ పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో గోవిందరాజు రూ.10 వేల నగదు బహుమతిని అందించారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు పత్సమట్ల లక్ష్మీపతి రాజు, పార్టీ అధ్యక్షులు రుద్రరాజు అప్పల రాజు, వైసీపీ నేత వేగేశ్న వెంకట సుబ్బరాజు, ప్రధానోపాధ్యాయులు టీవీ రామకృష్ణ, పీసీ చైర్మన్ దేవి తదితరులున్నారు.

పంచాయతీ సిబ్బందికి గ్లూకోజ్ పానీయం పంపిణీ

భీమడోలు: పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా బుధవారం భీమడోలు సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ వారికి గ్లూకోజ్ పానీయాన్ని పంపిణీ చేశారు. సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న తరుణంలో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ తెలిపారు.

ఆటో బోల్తా పడి ముగ్గురికి తీవ్ర గాయాలు


భీమడోలులో క్షతగాత్రుడికి వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

భీమడోలు: జాతీయ రహదారి కురెళ్లగూడెం వద్ద బుధవారం ఓ ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ద్వారకాతిరుమల స్వామివారిని దర్శించుకునేందుకు ఆకివీడు నుంచి ద్వారకా తిరుమలకు ఓ ఆటోలో తమ పిల్లలతో సహా ఎనిమిది మంది కుటుంబ సభ్యులు బయలుదేరారు. చిన్నపిల్లలతో కలిసి వారంతా ఆటోలో వస్తుండగా కురెళ్లగూడెం వద్దకు వచ్చేసరికి ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన వారిని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తీవ్ర గాయాలైన ఎం.పెద్దిరాజు, వి.శివప్రసాద్, ఎం.ప్రసన్నకుమార్‌కు ప్రాథమిక వైద్యం చేసి మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భీమడోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని ఏఎన్‌ఎం మృతి

నిడమర్రు: మండలపర్రు గ్రామ సచివాలయంలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న వాసే పండమ్మ (34) బలవన్మరణానికి పాల్పడిన ఘటన బుధవారం బువ్వనపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాసే పండమ్మ 2019 నుంచి మండలపర్రులో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తోంది. బువ్వనపల్లిలో భర్త సరిపల్లి సాగర్‌బాబు, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటోంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు భర్త బువ్వనపల్లిలోని ఇంటికి వచ్చి చూసేసరికి భార్య పండమ్మ ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెంది ఉంది. పోతునూరులో నివాసం ఉంటున్న మృతురాలి తండ్రి వాసే జోసెఫ్ కూతురు ఆత్మహత్యపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జ్ ఎస్సై కె.స్వామి తెలిపారు.

ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి అండగా నిలవాలి

- అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు
- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- ఎనికేపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం


ఎనికేపల్లిలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలు స్వయంగా తెలుసుకుని తగిన పరిష్కారం అందించేందుకే గడపగడపకు మన ప్రభుత్వంలో మీ ఇంటి వచ్చినట్లు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రజలనుద్దేశించి అన్నారు. బుధవారం అడవికొలను సచివాలయం పరిధిలోని ఎనికేపల్లి గ్రామంలో ఉదయం 8 గంటల నుంచే గడపగడపకు మన ప్రభుత్వం సందడిగా కొనసాగింది. దీంతో నియోజకవర్గంలో కార్యక్రమం 169వ రోజుకు చేరుకుందని మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబును సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు నేతలు పుష్పగుచ్ఛాలతో ఘనస్వాగతం పలికారు. మహిళలు ఎమ్మెల్యేకు హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్న ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజల ఆశీస్సులను అందించాలన్నారు. ఎటువంటి సిఫారసులు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేస్తున్నామన్నారు. పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా ఉండి తిరిగి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డికి ఘన విజయం అందించాలని కోరారు. ఎండ వేడిమిని సైతం ఎమ్మెల్యే వాసుబాబు, వైసీపీ శ్రేణులు లెక్క చేయకుండా 145 వరకూ గడపల వద్దకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. వారు చెప్పిన సమస్యలు తక్షణం పరిష్కరించేలా గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలు జారీ చేసారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, సచివాలయ మండల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, గ్రామా పార్టీ అధ్యక్షుడు గంధం సుభాష్, ఉపసర్పంచ్ సరిపల్లి త్యాగరాజు, ఆర్‌బీకే చైర్మన్ ముత్యాల సాయి, ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు దూసనపూడి సత్యనారాయణ,, ఎంపీటీసీ మజ్జి శ్రీను, పుప్పాల సాయి, సరిపల్లి యోసురాజు, సరిపల్లి రవి, గంధం రఘుబాబు, సప్పా శివ, సుంకర రాంబాబు తదితరులున్నారు.


ఎనికేపల్లిలో రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గ్రామంలో మైక్రో వాటర్ పిల్టర్ ప్రారంభం

జలజీవన్ నిధులు రూ.20 లక్షలతో గ్రామ మంచి నీటి పథకం వద్ద ఏర్పాటు చేసిన మైక్రో వాటర్ ఫిల్టర్‌ను ఎమ్మెల్యే వాసుబాబు బుధవారం గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొనే ముందు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, ఏపీఎం నాగేశ్వరరావు, ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్, ఎన్‌ఆర్‌జీఎస్ సతీష్ తదితరలుఉన్నారు.

జాతీయ విద్యావిధానంపై వర్క్‌షాప్

దెందులూరు: గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో బుధవారం జన్‌భగీదారీ జీ–2020 జాతీయ విద్యావిధానం వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎల్. శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల నైపుణ్యం కీలకమన్నారు. పలు అంశాలపై ప్రిన్సిపల్ కే.నాగేంద్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: 33/11 కేవీ సూరప్పగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 15వ తేదీ గురువారం భీమడోలు జంక్షన్ నుంచి సూరప్పగూడెం వరకు కొత్త 33 కేవీ లైన్ నిర్మాణంలో భాగంగా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏలూరు ఈఈ టి.శశిధర్ తెలిపారు. సూరప్పగూడెం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని భీమడోలు, పోలసానిపల్లి తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి మరవరానిది


ఉంగుటూరు: జగనన్న విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు.


దెందులూరు: పోతునూరులో చిన్నారులకు జగనన్న విద్యాకానుక అందిసిన సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేతలు

ఉంగుటూరు: విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి మరవరానిదని ఉంగుటూరు ఎంపీటీసీ పెనుగొండ బాలకృష్ణ అన్నారు. బుధవారం ఉంగుటూరు– 1 పాఠశాలలో విద్యాసామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సిరిమామిళ్ల పెద్దిరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బాలకృష్ణ మాట్లాడుతూ ఇంగ్లీషు మీడియం విద్య, నాణ్యమైన విద్యాసామగ్రి పంపిణీకి ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఎంపీటీసీ– 2 సందక రాంబాబు మాట్లాడుతూ వివిధ రకాల మెనూతో ప్రభుత్వం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంతోపాటు పాఠశాలలను ఆధునికరించి అనేక సౌకర్యాలు ఏర్పాటు చేసిందని అన్నారు. ఉపసర్పంచి పాతూరి జగదీష్, గ్రామ పెద్ద బండారు మధు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు బి .గౌరి ఈశ్వరి, ఆకుమూరి కవిత, మహిళా మండల అధ్యక్షురాలు ఎం. జయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తునూరు పాఠశాలలో..

దెందులూరు: జగనన్న విద్యాకానుక విద్యార్థులందరికీ వరమని, పేద విద్యార్థులు అన్ని రంగాల్లో స్థిరపడాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం మహోన్నతమైందని పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ అన్నారు. బుధవారం పోతునూరులో చిన్నారులకు జగనన్న విద్యాకానుకను వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, హెచ్‌ఎం రంగయ్య, ఉపాధ్యాయులతో కలిసి అందజేశారు.


పెదవేగి : కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

విద్యాకానుక కిట్ల పంపిణీ

పెదవేగి : దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యార్థుల కోసం పాఠశాల ప్రారంభించిన నాటి నుంచే పంపిణీ విద్యా కానుక కిట్లను పంపిణీ చేయడం చరిత్రాత్మకమని కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జి గవరరాజు అన్నారు. పెదవేగి మండలం కొప్పాక జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు విద్యా కానుక కిట్లను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించారని చెప్పారు. పీడీ మోర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు పద్మజారాణి, లైబ్రరీ అసిస్టెంట్ వాసు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


భీమడోలు: చిన్నారులకు పుస్తకాలను అందిస్తున్న సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, ఉపసర్పంచ్ ఇనపాల సాయి, నాయకులు


ఉంగుటూరు : నారాయణపురంలో అంగన్‌వాడీ స్కూలు వద్ద ర్యాలీ

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలు వురు వక్తలు కొనిడాయారు. భీమడోలు–3 ప్రాథమి క పాఠశాలలో బుధవారం పాఠశాలలోని 65 మంది బాలబాలికలకు జగనన్న విద్యాకానుక కిట్లను చిన్నారులకు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హెచ్‌ఎం డి.రెడ్డియ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్ పాము సునీతా మాన్‌సింగ్, ఉపసర్పంచ్ ఇనపాల సాయి, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు పాల్గొన్నారు.టీచర్ కేఎం మేరిప్రసాద్, అరుణకుమారి పాల్గొన్నారు.

ప్రీస్కూలుతో చిన్నారులకు మానసిక వికాసం

ఉంగుటూరు: ప్రీస్కూలు ప్రాముఖ్యత చిన్నారులకు ఎంతో అవసరమని సీడీపీవో ఆర్ విజయలక్ష్మి అన్నారు. బాదంపూడి, చేబ్రోలు, నారాయణపురం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజరు శారదామణి, ఆయా కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగిల్ సబ్జెక్టులతో డిగ్రీ కోర్సులు


నారాయణపురం ఎస్‌ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కరపత్రాన్ని విడుదల చేస్తున ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు

ఉంగుటూరు: సింగిల్ సబ్జెక్టులతో డిగ్రీ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు వెల్లడించారు. ఈపూరి సత్యనారాయణ మాట్లాడుతూ బీఎస్సీ కంప్యూటర్స్, బీఎస్సీ జువాలజీ, బీకాం, బీఏ ఎకనామిక్స్ ప్రధాన సబ్జెక్టుగా మరొక ఆప్షనల్ సబ్జెక్టుగా కంప్యూటర్ అప్లికేషన్ కోర్సు ఈ సంవత్సరం నుంచి డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. బుధవా రం నారాయణపురం కళాశాల సభ్యులు అధ్యాపకులు కళాశాలలో అందించే కోర్సు లపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. కళాశాల ప్రణాళికా సంఘం సభ్యులు ఈపూరి సత్యనారాయణ, బొమ్మిడి అప్పారావు, జానికిరామరాజు, ఆదిరెడ్డి సత్యానారాయణ, సీతారామాంజనేయరాజు,,నారాయణపురం, నిడదవోలు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఐక్యు కోఆర్డినేటర్లు కొండారవి, పీవీ లక్ష్మణరావు, రెడ్డియ్య పాల్గొన్నారు.

ఆట పాటలతో కూడిన విద్యతో మనోవికాసం


పోలసానిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న పీవో కేవీ విజయలక్ష్మీ

భీమడోలు: చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడం ద్వారా వారిలో మనోస్థైర్యాన్ని నింపుతుందని, మనోవికాసం వృద్ధి చెందుతుందని భీమడోలు ఐసీడీఎస్ పీవో కేవీ విజయలక్ష్మీ అన్నారు. పోలసానిపల్లి –15, పూళ్ల –49 అంగన్‌వాడీ కేంద్రాల వద్ద బుధవారం అంగన్‌వాడీ విద్య, ఆట పాటలతో విద్య అనే నినాదంతో జన్ భగీదారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, తల్లులు, కిషోర్ బాలికలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పోలసానిపల్లిలో మాజీ ఉపసర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్, పూళ్లలో సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ముఖ్య అతిథిగా పీవో కేవీ విజయలక్ష్మీ హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో పూళ్లలో సర్పంచ్ దాయం సుజాత, సూపర్‌వైజర్లు షాహనాజ్‌బేగం, నూర్జహాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.అంజలి, చల్లామణి, డి.నాగమణి, లక్ష్మీదుర్గ, పద్మావతి, నీరజ, శ్రీదేవి, ఏఎన్‌ఎం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదరిక రహిత సమాజ స్థాపనే మానవత లక్ష్యం


పూళ్లలో భీమడోలు మండల మానవత సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

భీమడోలు: పేదరిక రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తుందని ఉమ్మడి జిల్లాల మానవత సంస్థ అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. పూళ్ల కల్యాణ మండపంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా వట్టి సుగుణాకర్, ఉపాధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఆడబాల బాబి, సంయుక్త కార్యదర్శి అల్లాడ ప్రసాదరావు, కోశాధికారి గుల్ల అప్పారావు, ఎమర్జెన్సీ, విద్య, హెల్త్, అవేర్‌నెస్ విభాగాల కార్య నిర్వాహక సభ్యులు పున్నం గోపి, మునగంటి రమేష్, బంటు గణేష్, డోకల పెద్ద చిన్నారావు ప్రమాణం చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు, డీసీసీబీ డైరెక్టర్, కందులపాటి రాజీలు, మాజీ డైరెక్టర్ పుప్పాల శ్రీనివాస్, జిల్లా ప్రత్యే సేవా విభాగాల చైర్మన్ అప్పక రాంబాబు, మండల చైర్మన్ గుల్ల సూకరాజు పాల్గొన్నారు. అనంతరం వట్టి సుగుణాకర్‌ను పలువురు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. పూళ్ల సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్, జిల్లా నియంత్రణ కమిటి చైర్మన్ కె.సూర్యనారాయణ, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, ఎఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకటేశ్వరరావు, డైమండ్స్ క్లబ్ చైర్మన్ తుమ్మల ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎస్.బుల్లి వెంకట్రావు, దవులూరి ప్రభాకర్, గ్రామాల కన్వీనర్లు పాల్గొన్నారు.

నేడు మానవత నూతన కమిటీ ఎన్నిక

నిడమర్రు: మానవత సేవా సంస్థ నూతన మండల కమిటీ ఎన్నిక గురువారం సాయంత్రం 5 గంటలకు నిడమర్రు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రీజనల్ చైర్మన్ సంకు సత్యకుమార్ తెలిపారు. నూతన కమిటీ ఎన్నిక అనంతరం ఈ ఏడాదిలో మానవత సంస్థ చేపట్టబోయే తదితర కార్యక్రమాల అమలుపై తీర్మానాలు ఉంటాయన్నారు. ఈ సమావేశానికి మండలంలోని మానవత సంస్థ సభ్యులు అందరూ హాజరవ్వాలని అధ్యక్షుడు కాన్వెంట్ శ్రీను తెలిపారు.

విద్యుత్ భద్రతా నియమాలను పాటించాలి

భీమడోలు: విద్యుత్ భద్రతా నియమాలలను పాటించడం ద్వారా ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఏలూరు ఆపరేషన్స్ ఈఈ టి.శశిధర్ అన్నారు. భీమడోలులో మంగళవారం రాత్రి ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో భీమడోలు ఏడీఈ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది, సచివాలయ జేఎల్‌ఎంలకు విద్యుత్ భద్రతలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఈ కె.గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. ఏడీఈ కె.గోపాలకృష్ణ మాట్లాడుతూ పూళ్ల ఫీడర్ లైన్ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.15లక్షల నిధులు విడుదల చేసిందని, పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు భీమేశ్వరరావు, రామస్వామి, రామ్‌కుమార్, స్వామి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణం వేగవంతం

ఉంగుటూరు: జూలై నెలాఖరుకి ఉంగుటూరు నియోజకవర్గంలో 3వేల ఇళ్ల ప్రారంభోత్సవాలకు సిద్ధం చేస్తున్నామని భీమడోలు హౌసింగు డీఈ ఉప్పలపాటి సోమేశ్వరరావు తెలిపారు. ఇప్పటికి 2,300 ఇళ్లు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలి ఇళ్లను పూర్తి చేయడానికి అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. బుధవారం ఉంగుటూరు, చేబ్రోలు కాలనీల ద్వారాల ఇళ్ల నిర్మాణ ప్రగతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని లబ్ధిదారుల ఇళ్లను కాంట్రాక్టరు ద్వారా నిర్మించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. చేబ్రోలు, ఉంగుటూరు, బొమ్మిడి కాలనీల్లో 500 చొప్పున ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. కాలనీలు, ఇళ్లకు విద్యుత్, పైప్‌లైన్ ద్వారా నీటి సదుపాయం కల్పించామన్నారు. రూ.4.5 లక్షల వ్యయంతో ఆర్చిలు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఉంగుటూరు, బొమ్మిడి, చేబ్రోలులో ఆర్చి నిర్మాణాలు పూర్తయ్యాయని డీఈ తెలిపారు.

విద్యార్థులకు యోగ శిక్షణ

పెదవేగి : శరీరాన్ని, మనస్సును ఏకం చేయడమే యోగ ప్రాముఖ్యత అని కొప్పాక యోగా డిస్పెన్సరీ వైద్యాధికారిణి దుర్గాభవాని అన్నారు. పెదవేగి మండలం కొప్పాక ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక యోగ శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వృక్షాసనం, తాడాసనం, అర్ధచక్రాసనం, వజ్రాసనం, ప్రాణాయామాలు, సూర్యనమస్కారాలను స్థానిక పీడీ శ్రీనివాసరావు, యోగా ఇన్‌స్ట్రక్టర్ కె వినోద్‌కుమార్ చేయించారు. అనంతరం డాక్టర్ దుర్గాభవాని మాట్లాడుతూ జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగ దినోత్సవంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

గణపవరం: ఐదేళ్లలోపు పిల్లల్లో డయేరియా వ్యాధి నివారణకు ఓఆర్ఎస్, జింక్ ట్యాబ్లెట్లు ఉపయోగపడతాయని, తల్లిదండ్రులు ఈవిషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. బుధవారం గణపవరం పీహెచ్‌సీలో డయేరియా నివారణ పక్షోత్సవాల సందర్భంగా ఐదేళ్లలోపు పిల్లల తల్లులకు అతిసారాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి కేసులో ఇద్దరికి రిమాండ్

భీమడోలు: ఓ వృద్ధురాలిపై ఆమె మనవరాలు, ఆమె భర్త దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన కేసులో నిందితులిద్దరిని అరెస్ట్ చేసి భీమడోలు కోర్టులో హాజరపర్చగా వారికి రిమాండ్ విధించారని భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం గ్రామానికి చెందిన కొండపల్లి నిర్మల అనే వృద్ధురాలిని ఆమె మనవరాలు కొండపల్లి కొండపల్లి జోషి, ఆమె భర్త వరుణ్ తేజ్‌లు డబ్బులు బాకీ విషయంలో గొడవపడి ఆమెను కొట్టి తీవ్ర గాయపర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులు జోషి, వరుణ్‌తేజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

తక్కువ ధరకు జనరిక్ మందులు

భీమడోలు: పూళ్లలో ఏర్పాటు చేసిన జనరిక్ మందుల దుకాణాన్ని బుధవారం డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి రాజీలు, సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ ప్రారంభించారు. 30 జనరిక్ మందుల షాపులను ప్రభుత్వ అనుమతితో ప్రారంభిస్తున్నట్లు ఔషధీ ఫార్మశీ యాజమాన్యం తెలిపింది. జనరిక్ మందులపై 80శాతం వరకు సబ్సిడీ ఉంటుందని, ప్రజలు వినియోగించుకోవాలని కందులపాటి రాజీలు కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పుప్పాల బుజ్జీలు, షాపు నిర్వాహకులు రామకృష్ణ పాల్గొన్నారు.

దోమలతోనే వ్యాధుల వ్యాప్తి

గణపవరం: దోమల నివారణతో ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్‌నాయుడు అన్నారు. బుధవారం ఆయన వైద్యసిబ్బందితో కలిసి గణపవరంలో దోమల నివారణ, వ్యాధుల నుంచి రక్షణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్, యోహాన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.